# జిల్లా కేంద్ర సహకార బ్యాంకు అధ్యక్షులకు విజ్ఞప్తి

## సభ్యులకు సంఘాన్ని అందుబాటులోకి తెచ్చే విధంగా పునర్వ్యవస్థీకరణకు పూనుకోవాలి. తద్వార ప్రభుత్వ ప్రతిష్ఠను యినుమడింప చేయాలి.

సహకార అభివాదములు!

"సహకార సంరక్షణ సమితి" దేశంలో, రాష్ట్రంలో సహకార విధానము, భావజాలము పరిరక్షణకు చేస్తున్న కృషి తమరికి తెలుసు. భారత ప్రభుత్వ "గాట్" ఒప్పందముపై సంతకము చేసిన అనంతరము రూపొందించబడిన పంచవర్ష ప్రణాళికా పత్రము నుండి "సహకార రంగము" చాప్టర్‌ను తీసి వేసిన సందర్భములో సహకార ఆర్థిక విధానము, భావజాలమును రక్షించడానికి ఏర్పడిన వేదికే "సహకార సంరక్షణ సమితి" (Cooperative Movement Protection Council)

ప్రపంచీకరణ నేపథ్యంలో దేశంలోని వినియోగదారుల (సహకార రంగము) వ్యవస్థను నిర్వీర్యము లేదా అధీనము చేసుకోవడానికి ప్రైవేటు రంగము చేస్తున్న అనేక అక్రమాలను తమరు గమనిస్తూనే ఉన్నారు. కేంద్ర ప్రభుత్వము గత పార్లమెంటు సమావేశాలలో సహకార సంస్థలను ప్రైవేటు పరం చేయుటకు వీలు కల్పించే "కంపెనీస్ (2వ అమెండ్‌మెంట్) బిల్లు 2001" ను తేగా సహకార సంరక్షణ సమితి ఆ బిల్లు ఏ రకంగా రాజ్యాంగ విరుద్ధమైనది, గ్రామీణ వ్యవస్థపై కల్గించే దుష్ ప్రభావాన్ని అన్ని రాజకీయ పార్టీల ఫ్లోర్ లీడర్లకు వివరించి, ఆ బిల్లును విస్తృత పరిశీలన కొరకు "పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ"కి నివేదించునట్లు చేయడము సంరక్షణ సమితి విజయం. అంతే కాకుండా ఇటీవల రాష్ట్రంలో సహకార విధానాలలో చోటు చేసుకొంటున్న అనేక విషయాలలో "సహకార సంరక్షణ సమితి" తన వంతు పాత్రను నిర్వహిస్తున్న విషయము తమరికి తెలుసు.

### ప్రభుత్వ ధ్యేయము

**ప్రజల ఆర్థిక సాంఘీకాభివృద్ధి కార్యక్రమాలలో వారిని భాగస్వాములను చేస్తూ, ప్రభుత్వము పట్ల ప్రజల విశ్వాసనీయతను పెంచడము.**

సభ్యుల ఆర్థిక స్వయం సమృద్ధి చెందింప చేయడమే కాక సామాజిక అభివృద్ధికి అంకితమైన సహకార రంగము అనివార్యముగా ప్రభుత్వముతో సహకరించవలసి వస్తున్న విషయము తమరికి తెలుసు.

కాబట్టి ప్రజోపయోగంగ నున్న ప్రభుత్వ ధ్యేయాల కనుగుణంగా, ఇటీవల పరపతి వ్యవస్థలో ప్రభుత్వము తేవాలనుకుంటున్న మార్పులు, ప్రభుత్వ ధ్యేయాలను బలోపేతము చేసే విధంగా మనము ఆలోచించాల్సి ఉంది.

మేము "సింగిల్ విండో" అమలు విశ్లేషణ చేసిన పత్రాన్ని జత చేస్తున్నాం. పరిశీలించగలరు. ఈ విశ్లేషణ క్రిష్ణ, ఉభయ గోదావరి జిల్లాలో మాదిరిగా 2 నుండి 4 గ్రామాలకు ఒక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఏర్పాటు చేయడముతో పాటు పరపతేతర వ్యాపారం నిర్వహించడము ద్వారా నిర్వహణ ఖర్చులు అధిగమించడము సరైన విధానమని తేలుతుంది. అప్పుడు మాత్రమే సభ్యునికి సంఘం అందుబాటులోకి వచ్చి, తాను చురుకుగా పాల్గొని సంఘాన్ని అభివృద్ధి మార్గంలో నడుపగల్గుతాడని స్పష్టం చేస్తుంది.

నాల్గు గ్రామాల వ్యవహార పరిధికి మించిన సంఘాల యొక్క మహజన సభలను ఏర్పాటు చేసి వారి భాగస్వామ్యముతోనే రెండు, లేదా మూడు సంఘాలుగా మార్చి వారితో తాత్కాలికముగా కొత్త కమిటీల ఏర్పాటు చేయడము ద్వారా సభ్యుల చొరవకు అవకాశము కల్గుతుంది.

ఈ చర్యల వలన ప్రభుత్వము పట్ల క్రమంగ ప్రజల విశ్వాసనీయతను పెంచే అవకాశము కల్గుతుంది.

### మూసివేత ప్రాంతీయ అసమానతలకు ఆజ్యం, "ఆప్కాబ్" ను నష్టాలలోని నెట్టడము

ప్రచారము జరుగుతున్నట్లు 1297 సంఘాల మూసివేత రాష్ట్రంలో సహకార సంస్థల అభివృద్ధిలో ప్రాంతీయ అసమానతలను పెంపొందింప చేస్తుంది. ఈ సంఘాల మూసివేత సభ్యునికి సంఘం అందుబాటులో లేకుండా చేస్తుంది. రుణాల వసూళ్ళు సక్రమంగా జరుగడము కష్టము. అనివార్యంగా మూసివేత సంఘాల పరిధిలోని జిల్లా కేంద్ర సహకార బ్యాంకులు సెక్షన్ 11 పరిధిలోని నెట్టబడుతాయి. "నాబార్డు" నుండి రీఫైనాన్స్ పొందడము కష్టము.

ఈ క్రమములో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సహకార బ్యాంక్ నిజామాబాదు, కృష్ణ ఉభయ గోదావరి జిల్లాల వరకే పరిమితమయ్యే అవకాశము లేక పోలేదు. అదీను తాత్కాలికమే. 18 జిల్లా కేంద్ర సహకార బ్యాంకులు నష్టాలలోకి నెట్టి వేయడము వలన "ఆప్కాబ్" అనివార్యంగ నష్టాలకు గురి అవుతుంది.

రైతాంగములో ప్రభుత్వము పట్ల తీవ్ర వ్యతిరేకతను పెంచుతుంది.

తమరికి తెలుసు మూసివేతకు విధాన ఆధారము లేదు. కాపూర్ కమిటి సూచించిన అనేక అంశాలు రాష్ట్రం ఇది వరకే అమలు చేసింది. కాగా సహకార విధానానికి భిన్నంగ చేసిన సూచనలను అమలు చేయవలసిన అవశ్యకత ఎంత మాత్రము లేదు. కపూర్ కమిటి సూచనల అమలుపై కేంద్ర ఆర్థిక సహాయ మంత్రి శ్రీ వి.కె. పాటిల్ నాయకత్వాన ఏర్పడిన కమిటి చేసిన సూచనల ప్రకారము రాష్ట్రంలో 90% సంఘాలు మూసివేత అవసరము లేకుండానే "వన్ టైమ్ అసిస్టెంట్"కు అర్హతలోనున్న విషయము తమరికి తెలుసు.

కాబట్టి ప్రభుత్వాన్ని ప్రజల్లో పటిష్టపరిచే దిశగా, జిల్లా సహకార పరపతి ఉద్యమానికి నాయకులుగా ఉన్న తమరు పూర్వాపరాలు పరిశీలించి, సభ్యులకు అందుబాటులో లేని సంఘాలను వారికి అందుబాటులోకి తెచ్చె విధంగా సహకార పరపతి సంఘాలను పునర్వ్యవస్థీకరణకు పూనుకోవాలని "సహకార సంరక్షణ సమితి" మిమ్ముల్ని సవినయంగా కోరుతుంది.

ధన్యవాదములతో

సహకార ఉద్యమ సేవలో

S. Bhoomy

**(సంభారపు భూమయ్య)**

కన్వీనర్

రాష్ట్ర కన్వీనింగ్ కమిటి

Scanned by CamScanner